నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, సోమవారం 23 డిసెంబర్ 2024 | MAHABUBABAD

ఇల్లీగల్ మెట్రాలజీ!

ఆ శాఖలోని ఆఫీసర్ల తీరే వేరు..

- అసలే సిబ్బంది కొరత.. ఉన్న వారి సేవలూ వినియోగించుకోని వైనం
- తనిఖీలకు టెక్నికల్ అసిస్టెంట్లను తీసుకెళ్లని అధికారులు
- కార్యాలయానికే పరిమితం చేయడంపై విమర్శలు
- అక్రమార్జన కోసమేనంటూ ఆరోపణలు

వరంగల్‌లోని లీగల్ మెట్రాలజీ ప్రధాన కార్యాలయం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 22 : తూనికల కొలతల (లీగల్ మెట్రాలజీ) విభాగంలో సిబ్బంది కొరత అధికంగా ఉందని చెబుతున్న అధికారులు ఉన్న వారి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. వరంగల్ రీజియన్ డిప్యూటీ కంట్రోలర్ పరిధిలోని పలు జిల్లాల్లో కొంతమంది లీగల్ మెట్రాలజీ ఆఫీసర్లు టెక్నికల్ అసిస్టెంట్లను కావాలనే తమ వెంట తీసుకెళ్లడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా లీగల్ మెట్రాలజీ తనిఖీలకు వెళ్లినప్పుడు తప్పక ఉండాల్సిన వీరిని కార్యాలయానికే పరిమితం చేస్తున్నట్లు తెలుస్తున్నది. వరంగల్‌లోని డిప్యూటీ కంట్రోలర్ కార్యాలయం పరిధిలో వరంగల్, ఖమ్మం, కరీమాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాలకు ఉన్నతాధికారిగా డిప్యూటీ కంట్రోలర్ ఉంటూ తనిఖీలు, ఇతర వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తారు. అయితే సదరు అధికారి నల్లగొండ, వరంగల్ జిల్లాలకు ఇన్‌చార్జిగా ఉంటూ మూడు రోజులు అక్కడ, మిగిలిన రోజులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తుంటారు. దీంతో శాఖపై ఆయన అజమాయిషీ లేకపోవడంతో కొందరు అధికారులు వసూళ్లకు పాల్పడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

టెక్నికల్ అసిస్టెంట్లకు బదులు డ్రైవర్లు?

వరంగల్ రీజియన్ పరిధిలో హనుమకొండ, మహబూబాబాద్, ఆదిలాబాద్, సిరిసిల్ల, మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల, కాగజ్‌నగర్, ఖమ్మం, మధిర, భద్రాద్రి కొత్తగూడెం లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తుండగా, వరంగల్, పెద్దపల్లి, భద్రాచలంలో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, వ్యాపార వాణిజ్య సంస్థల్లో తనిఖీలు, స్టాంపింగ్ కోసం వెళ్లినప్పుడు కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు విధుల్లో ఉన్నప్పటికీ కొంతమంది అధికారులు తమ డ్రైవర్లు, అటెండర్లను తీసుకెళ్తున్నారు. వీరే వ్యాపారుల బాట్లు సరిచేయడం, వేయింగ్ మిషన్లను పరిశీలించడం చేసిన అనంతరం సంబంధిత అధికారి స్టాంపింగ్ వేస్తున్నారు. అయితే, లీగల్ మెట్రాలజీలో శిక్షణ పొందిన టెక్నికల్ అసిస్టెంట్ల సేవలు ఉపయోగించుకోకుండా వారిని ఆఫీసుకే పరిమితం చేయడంలో ఆంతర్యమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా వ్యాపారుల వద్ద వసూలు చేసిన డబ్బుల్లో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇది ఉన్నతాధికారికి తెలిసినా తనకు కూడా వాటా వస్తున్నందున పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇన్‌చార్జి అధికారులతో ఇబ్బందులు

లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీకి వెళ్లినప్పుడు టెక్నికల్ అసిస్టెంట్లను చాలా వరకు తీసుకెళ్తున్నారు. అయితే కొన్ని చోట్ల ఇన్‌చార్జి అధికారులున్నప్పుడు వారిని తీసుకవెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దూర ప్రాంతానికి వెళ్లినప్పుడు టెక్నికల్ అసిస్టెంట్లు సొంత జిల్లాకు రావడం సమస్యగా మారుతుంది. దీంతో ఎదురయ్యే ఇక్కట్లతోనే కొందరు అధికారులు వారిని తీసుకెళ్లడం లేదు. అలాగే మహిళా టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నచోట వారు రావడానికి సుముఖత చూపడం లేదు.

– రాజేశ్వర్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్

చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు

- గత ప్రభుత్వంపై ఆరోపణలు
- ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టండి
- బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్
- పాలించే శక్తి లేక ప్రతిపక్షంపై దాడి
- అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు
- రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై అవగాహన లేని సీఎం రేవంత్‌రెడ్డి
- మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్రం ఆగం
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

సమావేశంలో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య, పక్కన బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఇతర పార్టీ నాయకులు

హనుమకొండ, డిసెంబర్ 22: ఏడాది కాలంలోనే కాంగ్రెస్ చేతులెత్తేసి, నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టేస్తున్నదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార పాలన కాకుండా ప్రజా పాలనపై దృష్టి సారించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని పండుగలను అధికారికంగా నిర్వహించామని, ప్రజలు సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేలా, కానుకలు అందజేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందిపెడుతున్నదని, వారికి మేలు చేయడం లేదని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతోందన్నారు. లగచర్లలో రైతుల భూములను లాక్కుంటున్నదని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో కూల్చివేతలు, హైదరాబాద్ ప్రతిష్టను దిగజార్చే చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. కొత్తగా సినిమా ఇండస్ట్రీని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులు, ప్రజల పక్షాన పోరాడుతుంటే కేసులు పెడుతోందన్న దాస్యం ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తామని, నిలదీస్తామని హెచ్చరించారు. ఇప్పటికైన ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించి ప్రజల మన్ననలు పొందాలని వినయ్‌భాస్కర్ హితవు పలికారు.

పాలించే శక్తి లేక ప్రతిపక్షంపై దాడి..

కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే శక్తి లేక ప్రతిపక్షంపై ఎదురు దాడి చేస్తున్నదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ధ్వజమెత్తారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎపుడు ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా అప్పులపై అన్ని తప్పుడు లెక్కలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయోత్సవాలు చేసుకుంటున్న ప్రభుత్వానికి సంవత్సరం తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎందుకు ఆలోచించలేదని పొన్నాల ప్రశ్నించారు. అసెంబ్లీని వేదికను చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చేస్తుందని ఆరోపించారు. 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అమలు చేస్తారా.. ఇచ్చిన 420 హామీలు, ఆరుగ్యారెంటీలను అమలు చేస్తారా.. వీటికి ఎంత డబ్బు అవసరమవుతుందో ప్రజలకు బాహాటంగా చెప్పగలరా అని పొన్నాల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం ఏ ప్రభుత్వమైనా అప్పులు చేస్తుంది.. ఆ మేరకు అభివృద్ధి కూడా జరుగాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అప్పులు చేసినప్పటికీ అందుకు అనుగుణంగా అభివృద్ధి చేసి చూపించారని అన్నారు. 29 రాష్ట్రాల్లో మెరుగైన ఆదాయం మన రాష్ట్రానిదేనని, రాష్ట్ర సంపదకు అప్పుకు ఎంత తేడా ఉందో అసలు తెలుసాఅని సీఎంను ప్రశ్నించారు. రాష్ట్ర ఆదాయానికి సంపద సైతం 10 ఏండ్లలో మూడురెట్లు పెరిగిందని, తలసరి ఆదాయం సైతం మూడు రెట్లు పెరిగిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు అప్పులు ఉన్నాయన్న పొన్నాల దేశానికి సైతం ఆదాయంతో సమానమైన అప్పు ఉందని తెలిపారు. అమెరికా 29 ట్రిలియన్‌ల ఆదాయం కంటే అప్పు ఎక్కువని, అలాగే జర్మనీ ఆదాయం, అప్పులు సమానంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితి గురించి మాట్లాడుతున్న సీఎం ఇటీవల మూసీప్రక్షాళన అన్నారు.. ఆ కార్యక్రమం మీ మ్యానిఫెస్టోలో లేదన్నారు. కూల్చివేతలు, నూతన నిర్మాణాలు, విద్యుత్, ఇతర అన్ని ఖర్చులు కలిపితే రూ.లక్షా 60వేలకోట్లు ఖర్చు అవుతుందన్నారు. మరి అంత బడ్జెట్ ఉందా..? అదనం ఖర్చు ఎక్కడి నుంచి తెస్తారు.. హామీలు అడిగితే మాత్రం గత ప్రభుత్వం అప్పు లు అంటున్నారని మండిపడ్డారు. ప్రజలకు నిన్నటి వరకు జరిగిన అసెంబ్లీని చూస్తుంటే సినిమా హాల్‌ను తలపిస్తుందన్నారు. ఇటీవల మీ ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చినప్పటికీ వారు అసెంబ్లీలో మాట్లాడిన విధానం, వ్యవహరించిన తీరు చిత్రంగా ఉందన్నారు. అప్పులపై చర్చిస్తామంటే రారు.. మైకు ఇవ్వరు.. నిరసన తెలిపితే ఒప్పుకోరని ఎద్దేవా చేసారు. సీఎం రేవంత్ రెడ్డి అదానీ గురించి మాట్లాడుతుంటే నవ్వు వస్తుంది, అదానీ ఇచ్చిన వంద కోట్లు డబ్బులు ఎవ్వరికి పోయాయో ప్రజలకు తెలుసన్నారు. అలాగే ఇంకో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం రూ. 200కోట్లు ఇవ్వగానే మంచోడు అయిపోయాడని ఆరోపించారు. చరిత్ర ఎప్పుడైనా మారదన్న పొన్నాల రాముడు ఎవరో...రావణుడు ఎవ రో ప్రజలకు తెలుసన్నారు. మంచి ఎవరు చేశారో మంచి వైపు ఎవరు నిలిచారో తెలుస్తోందని అన్నారు. లగచర్లను చూస్తే శ్రీలంక పోవాల్సిన పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ వచ్చిందన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పని సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ కావాలటా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ రాముడైతే... రేవంత్‌రెడ్డి రావణుడని పొన్నాల లక్ష్మయ్య అన్నాడు. ఈ సమావేశంలో కుడా మాజీ చైర్మెన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజక వర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ నాయకులు నయీమొద్దిన్, మిట్టపల్లి రమేశ్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సీపీఎస్ అంతమే పంతం

- పాత పెన్షన్ అమలు కోసం పోరాడాలి
- యూపీఎస్ అమలును అడ్డుకోవాలి
- ఓరుగల్లు వేదికగా సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్మితప్రజ్ఞ
- వరంగల్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయుల కాకతీ కదన భేరి

కాకతీ కదన భేరిలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు స్మితప్రజ్ఞ

పోచమ్మమైదాన్, డిసెంబర్ 22 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉరితాడుగా మారిన సీపీఎస్‌ను అంతం చేయడమే పంతంగా పెట్టుకోవాలని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్మితప్రజ్ఞ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న యూపీఎస్‌ను అడ్డుకోవడంతో నాటి పాత పెన్షన్ అమలు కోసం పోరాటం చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో ఆదివారం వరంగల్‌లోని ఇస్లామియా కళాశాల మైదానంలో కాకతీ కదనభేరిని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా స్మితప్రజ్ఞతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, కోశాధికారి ఈడిగి నరేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్మితప్రజ్ఞ మాట్లాడుతూ 2004లో సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు ఆనాటి సంఘాలు ప్రతిఘటించకపోవడం వల్లే ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1, 2025 నుంచి అమలు చేయనున్న యూపీఎస్‌ను అందరూ ఏకమై ఆపాలన్నారు. రాష్ట్రంలో 2.50 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులున్నారని, వీరందరికీ కొత్త పెన్షన్ విధానం గుదిబండగా మారుతుందని, వీరి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్తాన్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌తో పాటు పంజాబ్‌లో పాత పెన్షన్‌ను అమలు చేస్తున్నారని స్మితప్రజ్ఞ పేర్కొన్నారు. సభలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగమూర్తి, బుచ్చన్న, కొంపెల్లి రవీందర్‌రెడ్డి, అఫ్జల్, కొండా శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, రవికాంత్, నాగమణి, రవిచంద్ర, తోట విక్రమ్, ఆవునూరి రవి, కిషన్, రాజేందర్, రవికాంత్, శేషగిరి, డాక్టర్ అన్వర్, శివకోటి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి...

సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల ప్రచారంలో ఓరుగల్లు వేదికగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా దీనిని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుముప్పుగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ అదే ఓరుగల్లు వేదికగా కాకతీ కదన భేరి ద్వారా విన్నవిస్తున్నాం. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినందున మా సమస్యను పరిష్కరించాలి.

– కల్వల శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వంటావార్పుతో వినూత్న నిరసన

17వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

వంటా వార్పులో భాగంగా రోడ్డుపై పిల్లాపాపలతో కలిసి భోజనం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

హనుమకొండ, డిసెంబర్ 22 : సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం 17వ రోజుకు చేరుకుంది. బాల సముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు దొనికెల శ్రీధర్‌గౌడ్, ఎండీ షఫీ ఆధ్వర్యంలో 17వ రోజు వంటా వార్పుతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. 16 రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో వంటావార్పు కార్యక్రమం ద్వారా తమ నిరసన తెలిపామని శ్రీధర్‌గౌడ్, షఫీ తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తే సమ్మె మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల సమగ్ర శిక్షా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకో న్యాయం.. మాకో న్యాయమా..?

- నక్సల్స్ చనిపోతేనే పరామర్శకు వస్తారా..
- ఇన్‌ఫార్మర్ల నెపంతో హతమైన వారి సంగతేంది
- ఏటూరునాగారంలో మావోయిస్టు బాధిత కుటుంబాల ఆందోళన
- పౌరహక్కుల నేతలను అడ్డుకునేందుకు యత్నం

ఏటూరునాగారం, డిసెంబర్ 22 : 'అమాయకులు ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టుల చేతిలో హతమైతే పట్టించుకోరు.. మమ్ములను కనీసం పరామర్శించేందుకు రారు.. అదే ఎన్‌కౌంటర్‌లో నక్సల్ మృతి చెందితే మాత్రం వారి కుటుంబాలను కలిసేందుకు వస్తారు.. మావోయిస్టులకో న్యాయం.. మాకో న్యాయమా?' అని మావోయిస్టు బాధిత కుటుంబాలు పౌరహక్కుల సంఘం నేతలను ప్రశ్నించారు. మావోయిస్టులు, పౌరహక్కుల సంఘాలకు వ్యతిరేకంగా మావోయిస్టు బాధిత కుటుంబాలు ఆదివారం సాయంత్రం ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. గత నెల 21న రాత్రి వాజేడు మండల కేంద్రంలో ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేసిన పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్, ఎడ్ల కాపరి ఉయిక అర్జున్ కుటుంబాలతో పాటు అంతకుముందు వెంకటాపురం మండలంలో బాంబు పేలిన ఘటనలో కాళ్లు కోల్పోయిన సునీత, ఇతర బాధిత కుటుంబాల సభ్యులు ఆందోళనలో పాల్గొన్నారు. ఈనెల 1న ఏటూరునాగారం మండలం చెల్పాక సమీప అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా పౌర హక్కుల సంఘాల నాయకులు పది మంది వరకు ఎన్‌కౌంటర్ జరిగిన స్థలానికి ఆదివారం వస్తున్నట్లు తెలుసుకున్న రమేశ్, అర్జున్ కుటుంబ సభ్యులు, వారి బంధువులు, గ్రామస్తులు వారిని అడ్డుకునేందుకు ఏటూరునాగారం వచ్చారు. మధ్యాహ్నం సంఘాల నాయకులు చెల్పాక వైపు వెళ్లినట్లు తెలుసుకున్నారు. వారిని అడ్డుకునేందుకు వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు చీకటి పడుతుండడంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో మృతుడు అర్జున్ భార్య సావిత్రి, తల్లి, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మను దహనం చేసి ధర్నా నిర్వహిస్తున్న మావోయిస్టు బాధిత కుటుంబాలు

కొత్తగా వచ్చి.. మీ పెత్తనమేంది?

- గ్రంథాలయ సంస్థ చైర్మన్‌పై కాంగ్రెస్ నేత ఆగ్రహం
- ఎమ్మెల్యే నాయిని ముందే అజీజ్‌ఖాన్‌పై దాడి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 22 : కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి కాకుండా పార్టీలో కొత్తగా చేరిన వారికి పదవులు ఇస్తుండటంపై ఆ పార్టీ నాయకులు, శ్రేణుల్లో అసంతృప్తి పెరుగుతున్నది. ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న తమపై వారు పెత్తనం చెలాయించడంపై పాతవారు మండిపడుతున్నారు. వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. శనివారం రాత్రి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ అజీజ్‌ఖాన్‌పై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముందే దాడికి దిగారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండలోని సెయింట్‌పాల్ పాఠశాలలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్, 5వ డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత అందరూ కలిసి భోజనం చేసేందుకు వెళ్లేక్రమంలో అప్పుడే అక్కడికి వచ్చిన కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ తమ్ముడు పోతుల సత్యనారాయణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్‌తో గొడవకు దిగాడు. కాంగ్రెస్ పార్టీని పట్టుకుని ఉన్న వారిపై ఇతర పార్టీల నుంచి వచ్చిన వారి పెత్తనం నడుస్తున్నదని, వారికే నామినేటెడ్ పదవి ఇస్తున్నారని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఎదుటే గొడవ చేస్తూ అజీజ్‌ఖాన్‌పై దాడికి దిగాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అడ్డుకుని ఇది సమయం కాదని, ప్రైవేట్ ప్రోగ్రాంలో మీ లొల్లి ఏందంటూ సముదాయించే ప్రయత్నం చేశాడు. అయినా వినకుండా ఇరువురు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ దూషించుకున్నారు. వీరి గొడవతో క్రిస్మస్ వేడుకలకు వచ్చిన వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు.

నిరుద్యోగులకు టోకరా

- ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం
- రూ.కోట్లలో డబ్బుల వసూలు
- ఇద్దరి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 22: ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన ఇద్దరిని పోలీస్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం.. ట్రాన్స్‌కోలో ఉద్యోగాలిప్పిస్తామని రెండు సంవత్సరాల క్రితం స్థానిక నిరుద్యోగులను మభ్యపెట్టి, వారి నుంచి రూ. 1.76 కోట్లు వసూలు చేశారు. అయితే డబ్బులు ఇచ్చిన వారు ఉద్యోగాలివ్వాలని వెంటపడడంతో నిరుద్యోగ అభ్యర్థులకు ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్స్‌ను ఇచ్చారు. తీరా అవి చెల్లకపోవడంతో డబ్బులు పోయిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. టౌన్, రూరల్ పోలీసులు కలిసి ఆదివారం తనిఖీల్లో భాగంగా కురవి మండలం మొగిలిచర్లకు చెందిన ఇరుకులపాటి నాగేశ్వరరావు, హన్మకొండ జిల్లా శాయంపేటకు చెందిన మండల సహోదర్‌రెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరు జిల్లాలో ఐదు కేసులలో ముద్దాయిలుగా ఉన్నారని, ఈ కేసును పూర్తిగా విచారించి, ఇందులో మిగిలి ఉన్న నిందితులను అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ సర్వయ్య, టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై దీపిక, విజయ్‌లను ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించారు.

రూ.2.50లక్షలు టోకరా...

నర్సంపేట : ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగురాలి నుంచి ఓ వ్యక్తి రూ.2.50లక్షలకు టోకరా వేసిన ఘటన నర్సంపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం.. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన బుడికొండ శ్రుతి బీకాం కంప్యూటర్ గతంలో పూర్తి చేసింది. ఆమె ఇంటి పక్కనే ఉన్న వావిళ్ల ప్రసాద్‌కుమార్ 13 నెలల క్రితం నర్సంపేట పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్కానింగ్ సెక్షన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని శృతికి నమ్మబలికాడు. ఇందుకు రూ.2,50,000లు ఖర్చు అవుతాయని సదరు వ్యక్తి ఆమెతో చెప్పాడు. తప్పకుండా ఉద్యోగం వస్తుంది, పూర్తి బాధ్యత నాదే అని నమ్మకంగా చెప్పగా సదరు మహిళ అతడిని నమ్మి రూ.2,50,000లు ఇచ్చింది. సదరు వ్యక్తి తనకు గత ఏడాది అక్టోబర్ 28న రిపోర్టింగ్ అపాయింట్‌మెంట్ లెటర్ కూడా ఇచ్చాడని తెలిపింది. గత సంవత్సరం నవంబర్ 5న ఆఫీస్‌లో ఉద్యోగంలో జాయిన్ అవ్వాలని సదరు వ్యక్తి ఆమెకు చెప్పాడు. ఆ తర్వాత ఆమె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే అది ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్ అని సంబంధిత అధికారులు చెప్పడంతో ఆమె ఖంగుతింది. అప్పటి నుంచి ప్రసాద్‌కుమార్‌ను అడిగితే రేపు, మాపు అంటూ మాట దాట వేశాడని తెలిపారు. ఈక్రమంలో గత నెల 5న సదరు వ్యక్తిని శృతి నిలదీసి అడగగా డబ్బులు ఇవ్వను పో, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ దబాయిస్తున్నాడని బాధితురాలు వాపోయింది. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్న సదరు వ్యక్తిని విచారించి చట్టరీత్యా చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితురాలు శృతి కోరుతున్నది.

నేడు వంగరలో పీవీ 20వ వర్ధంతి

హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

భీమదేవరపల్లి, డిసెంబర్ 22 : భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతి ఆయన స్వగ్రామం వంగరలో సోమవారం జరుగనున్నట్లు పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు తెలిపారు. ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీవీ కూతురు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి హాజరుకానున్నట్లు చెప్పారు.